ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025 5 అనంతపురం

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాక

ప్రజాశక్తి-అనంతపురం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం నాడు అనంతపురం జిల్లాకు విచ్చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రల్లో పాల్గొనేందుకు మంగళవారం నాడు శ్రీనివాసరావు జిల్లాకు రానున్నారని తెలిపారు. తాడిపత్రి ప్రాంతంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయబోయే ప్రాంతాల్లో ఆయన పర్యటించి అక్కడి రైతులతో మాట్లాడుతారని తెలిపారు. సాయంత్రం అనంతపురం నగరానికి చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలియజేశారు.

'భూ' చాళ్లు..!

'చిన్న పిల్లలు అన్నం తినకుండా మారం చేస్తే భూచాడొచ్చాడని భయపెట్టి తినపించడం చూస్తుంటాం.' అటువంటిదే జిల్లాలో భూముల విషయాల్లోనూ జరుగుతోంది. పరిశ్రమలొచ్చేస్తున్నాయి... మీ భూములను తక్కువ ధరకే తీసేసుకుంటారు.. మేమైతే ఎక్కువ ధర ఇస్తామని చెప్పి భూములను తమ వశం చేసుకునే పద్ధతులు జోరుగా సాగుతున్నాయి. వివాదాలను వారే సృష్టించి సెటిల్‌మెంట్ పేరుతో సమస్యను పరిష్కరిస్తున్నట్లు నటించి మోసం చేస్తున్నారు. ఇలాంటి 'భూ'చాళ్లతో అసలైన భూ హక్కుదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

- ◆ రైతులను భయపెట్టి, ప్రలోభపెట్టి భూములు వశం
- ◆ వేల ఎకరాల సేకరణకు సాగుతున్న కసరత్తు
- ◆ వివాదాలొస్తే పెద్దలొచ్చి సెటిల్‌మెంట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెన్యూవబుల్ ఎనర్జీ పేరుతో సోలార్, విండ్, హైబ్రీడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దఎత్తున అనుతులిచ్చింది. గత ప్రభుత్వం హయాంలో ఇచ్చినవి, ఇప్పుడు ఇస్తున్నవి కలిపి సుమారు ఏడు, ఎనిమిది మెగావాట్ల విత్యుత్ ఉత్పత్తికి అనుమతులు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. వీటికి సోలార్‌కు అయితే సగటున ఒక్క మెగావాట్‌కు నాలుగు నుంచి గరిష్టంగా ఆరు ఎకరాల వరకు భూమి అవసరం అవుతుంది. అదే విండ్‌కు అయితే మూడు ఎకరాల వరకు భూమిని సేకరిస్తున్నారు. టవర్ ఏర్పాటు అర ఎకరంలోనే పూర్తయినా.. దానికి భవిష్యత్‌లో దారి వాటికోసమని అదనంగా సేకరిస్తున్నారు. ఈ లెక్కన ఒక్క మెగావాట్‌కు సగటున నాలుగు ఎకరాల వరకు భూమి అవసరం అవుతోంది. ఈ భూమిని ప్రభుత్వం సోలార్‌కు అయితే ఎకరానికి ఏడాదికి రూ.31 వేలు లీజు చెల్లించాలని నిబంధన అనుమతుల సమయంలో కంపెనీలకు షరతు పెట్టింది. కాకపోతే సేకరణ వారికే వదిలేసింది. దీంతో భూమిని లీజు పద్ధతిలో కాకుండా నేరుగా సేకరించడం ద్వారా ఏడాది లీజు తగ్గుతుందన్న ఉద్దేశంతో ఆ సంస్థలు ఒకేసారి భూసేకరణ కూడా వీలైన చోటళ్లా చేపట్టేందుకే మొగ్గు చూపుతోంది. ఇది ఒక రకంగా స్థానిక నాయకులకు కూడా వరంగా మారుతోంది. కంపెనీకి అవసరమైన భూసేకరణ వ్యవహారాన్ని చక్కబెట్టే పని స్థానికంగానున్న నేతలు చేపడుతున్నారు. అంటే ఈ భూముల కొనుగోళ్లలో పెద్దఎత్తున చేతులు మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. భూములు కంపెనీలకు పోతున్నాయి... తమకిస్తే ఒకేసారి మొత్తం డబ్బులు చెల్లిస్తామని స్థానిక నేతలు మధ్యవర్తిత్వం వహిస్తుండటం గమనార్హం.

సమస్యవస్తే పెద్ద మనిషి సెటిల్‌మెంట్

అనంతపురం జిల్లాలో ఒక నియోజకవర్గంలో రెవన్యూవబుల్ ఎనర్జీ కోసమని ఒక సంస్థకు అనుమతులొచ్చాయి. ఆ సంస్థకు భూసేకరణ చేయాల్సి ఉంది. పక్క జిల్లాకు చెందిన ఒక వ్యక్తి వచ్చి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించాడు. స్థానికంగా ఉన్న నాయకులు దీన్ని అడ్డుకున్నారు. తాముండగా బయటనుంచి వచ్చి ఏ రకంగా చేస్తారని అడ్డుపడ్డారు. దీంతో అమరావతి నుంచి ఒక పెద్ద మనిషి ఆ నియోజకవర్గానికి విచ్చేశారు. ఆయన స్థానిక నాయకులు, భూసేకరణ చేపట్టిన వ్యక్తుల మధ్య సయోధ్య కుదర్చివెళ్లినట్టు సమాచారం. ఇందులో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రకంగా భూసేకరణ స్థానిక నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కంపెనీలకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా కాసులొస్తుండగా, నేతలకు భూ వ్యవహారాలు పంట పండిస్తున్నాయి. రైతులు మాత్రం భూములు, గ్రామాలను వదిలి శాశ్వత వలసలు వెళ్లే పరిస్థితులు నెలకొనబోతున్నాయి.

పరీక్ష కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు

'పది' పరీక్షలకు 601 మంది గైర్హాజరు

ప్రజాశక్తి అనంతపురం సిటీ

జిల్లావ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 601 మంది గైర్హాజరయ్యారని ఏసీ గోవింద నాయక్ తెలిపారు. జిల్లాలోని 135 కేంద్రాల్లో 30,906 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 30,305 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను 30 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, ఏడుగురు ప్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీ చేశారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు రాస్తున్న ఐదు కేంద్రాల్లో ఏడు మంది విద్యార్థులకు ఐదుమంది హాజరవగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాలను అబ్జర్వర్ తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు మూడు ప్లయింగ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

అనంత మేయర్‌పై అవిశ్వాసం..?

- ◆ 22 మంది కార్పొరేటర్ల సంతకాలు
- ◆ సొంత పార్టీలోనే అసమ్మతి కుంపటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహమ్మద్ వసీం సలీంపై అవిశ్వాసం పెట్టేందుకు సొంత పార్టీ కార్పొరేటర్లే సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే అవిశ్వాస పత్రంపై వైసిపి కార్పొరేటర్లు 22 మంది సంతకాలు చేసినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యేతో విభేదాలు ఉండటంతో ఆయన వద్దకు వెళ్లని ఆరుగురు కార్పొరేటర్లలో ఒకరు అవిశ్వాసానికి వీలుగా సంతకాల సేకరణ చేపట్టారు. మేయర్ వసీంను గద్దె దించడమే ప్రధాన ధ్యేయంగా ఈ సంతకాల సేకరణ జరిగినట్లు తెలుస్తోంది. తదుపరి మేయర్ ఎవరన్నా దానిపై వారు పెదవి విప్పటం లేదు. ప్రస్తుతం వసీంను గద్దె దింపడమే ప్రధాన అజెండాగా కార్పొరేటర్లు ముందుకు నడుస్తున్నారు. వసీం తర్వాత మేయర్‌గా ఎవరిని ఎన్నుకున్నా తమకు అభ్యంతరం లేదని సంతకాల సేకరణ చేపట్టిన వారు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వైసిపి జిల్లా అధ్యక్షునితో తీవ్ర విభేదాలు ఉండి ఆయన స్వగహానికి వెళ్లని వారిని కూడా కదిరికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వ్యక్తి ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. అధిష్టానం సూచన మేరకు తాను మాట్లాడుతున్నానని, రాత్రి 11 గంటలకు తనను కలవాలని సదరు నాయకుడు సూచించినట్లు తెలుస్తోంది. గడచిన రెండు రోజులుగా ఆర్‌అండ్‌బి అతిథి గహం కేంద్రంగా అవిశ్వాస వ్యూహ రచన జరిగిందని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల ముఖ్య నేత కూడా మేయర్ సలీం వ్యవహార శైలిపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అవిశ్వాస అంశం తెరపైకి వచ్చింది. కాగా వైసిపిలో జరుగుతున్న ఈ పరిణామాలు అన్నీ తెలుగుదేశం పార్టీకి ఊతం అందించేలా ఉందని ఆ వర్గాలు సంబరపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం వ్యవహారం ఎటు వైపు వెళ్తోందో మరో రెండు రోజుల్లో తేలనుంది.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

విద్యార్థులకు ఉపాధి నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి-అనంతపురం

ఎంటెక్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఉపాధి అవకాశాలకు అనుగుణంగా అందుకు అవసరం అయిన నైపుణ్యాలను పెంచుకోవాలని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తెలిపారు. అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎం.టెక్, ఎంసిఎ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి డాక్టర్ జే.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు

గ్రామాల్లో ఆందోళనకు గురి చేస్తున్న ఘర్షణలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలో ఇటీవల గ్రామాల్లో వరుస ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయన్న ఆందోళనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గతంలో ఓ భూ వివాదంతో రెండు జంట హత్యలు జరిగాయి. అది మరువక మునుపే మెడికర్తి గ్రామంలో ఒక హత్య జరిగింది. గ్రామాల్లో ఆస్తి తగదాలు, పాత కక్షలతో ఘర్షణలు చోటు చేసుకుని ఫిర్యాదుదారులు పోలీసు స్టేషన్ వద్దకు వస్తున్నారు. ఇటీవల మండల పరిధిలోని వెన్నపూసపల్లిలో ఆస్తి తగాదా విషయంలో ఓ ఇంటిని కూల్చివేసిన ఘటన చోటు చేసుకుంది. గడ్డంవారి పల్లిలో భూ వివాదంలో రెండు వర్గాలు కర్రలు, కత్తులతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. యల్లనూరులో పాతకక్షల నేపథ్యంలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఇలాంటి సంఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఫ్యాక్షన్ మండలంగా ఉన్న యల్లనూరుకు గత ఆరు మాసాల నుంచి ఎస్ఐ లేరు. ఇక్కడకు వచ్చిన వచ్చిన ఎస్ఐలు ఏదోసాకుతో ఇక్కడ నుంచి వచ్చిన కొద్ది రోజులకే వెళ్లిపోతున్నారు. హెచ్ఒడి కూడా ఈ స్టేషన్‌కు లేరు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మండలంలో నేరాల అదుపునకు పోలీసు స్టేషన్‌కు ఎస్ఐను నియమించి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాత్రికేయుడిపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాఘవేంద్రను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి పాత్రికేయుడు రాఘవేంద్రపై పట్టణానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ సాబ్జాన్ దాడి చేయడం దుర్మార్గం అని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మున్సి పాలిటీ పరిధిలోని దొడగట్టలో గతంలో ఓ వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాంట్రాక్టర్ సాబ్జాన్ తీసుకెళ్లడానికి ప్రయత్నం చేయగా అప్పట్లో రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే అంశానికి సంబంధించి ఆ రోజు రాఘవేంద్ర తోటి మీడియా మిత్రులకు ఫొటోలు, వీడియోలు పంపించాడనే కక్షతో గత ఆదివారం రాఘవేంద్రపై పట్టణంలోని బళ్లారి మిట్టపై సాబ్జాన్ దాడి చేశారు. ఓ రైతు ఆవేదనపై వార్త రాయగా కాంట్రాక్టర్ సాబ్జాన్ తనపై దాడి చేశాడని రాఘవేంద్ర పట్టణ సిఐ యువరాజుకు ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి బాధిత పాత్రికేయుడు రాఘవేంద్రకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు తిప్పేనాయక్, టిడిపి నాయకులు శ్రీరాములు, అనంత వాయిస్ ఎడిటర్ టిపి.కిరణ్, టిపి.సురేష్, వినోద్, ప్రతాప్, చైతన్య, మహేష్, బేరీల రాజు, నూర్‌మహ్మద్, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, సోము డిమాండ్ చేశారు. అనంతరం వారు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రాఘవేంద్రను పరామర్శించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

కళ్యాణదుర్గం పట్టణంలో ప్రజాశక్తి విలేకరి రాఘవేంద్రపై విద్యుత్ కాంట్రాక్టర్ సాబ్జాన్ చేసిన దాడిని సిపిఎం ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో ఓ వ్యవసాయ పోలంలో కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లడానికి కాంట్రాక్టర్ ప్రయత్నించగా రైతుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ విషయాన్ని విలేకరి రాఘవేంద్ర తోటి మీడియా మిత్రులకు సమాచారం ఇచ్చి ఫొటోలు తీయించాడన్న కారణంతో సదరు కాంట్రాక్టర్ ఆదివారం నాడు బళ్లారి మిట్టపై దాడి చేశారన్నారు. ఓ రైతు ఆవేదనను వార్త రాసేందుకు ప్రయత్నించిన పాత్రికేయునిపై దాడి చేయడం సరికాదన్నారు. పోలీసులు స్పందించి దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం..!

'పది' విద్యార్థులు సురక్షితం

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఆటోలో సోమవారం ఉదయం బయలుదేరారు. దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల మధ్య ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గంకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోకు సైడ్ ఇవ్వకపోవడంతో ఆటో డ్రైవర్ రోడ్డు కిందికి దింపాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు లేకుండా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అస్రాఫ్ అలీ, ఎస్ఐ శివలు విద్యార్థులను వెంటనే మరొక వాహనంలో పరీక్ష కేంద్రానికి పంపారు. ఆటోల్లో ఎక్కువ మందిని ఎక్కించుకుని రాకపోకలు చేయొద్దని ఆటో డ్రైవర్లను పోలీసులు ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరక్కపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపుపై రగడ..!

- ◆ వీధికుక్కల పట్టివేతలో అక్రమాలు జరిగాయి : ఎమ్మెల్యే
- ◆ అక్రమాలు జరిగి ఉంటే విచారణ చేయించండి : మేయర్
- ◆ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాల్లో వాదోపవాదాలు

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో వీధికుక్కల పట్టివేత నిధులు విడుదల అంశంపై మరోసారి అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద ఎత్తున వాదోపవాదాలు జరిగాయి. సోమవారం ఉదయం మేయర్ మహ్మద్ వసీం అధ్యక్షతన కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. వీధి కుక్కల పట్టివేత, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సంబంధించి నిధుల విడుదల, బిల్లుల చెల్లింపు అంశంలో ఎమ్మెల్యే, మేయర్లు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. వర్క్ ఆర్డర్ లేకుండానే రూ.34 లక్షల బిల్లులు ఇచ్చి అవినీతికి పాల్పడ్డారంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కార్పొరేషన్ పాలకవర్గంపై ఆరోపణలు చేశారు. రూ.14 లక్షల బిల్లులనూ ఇలాగా మంజూరు చేశారని ధ్వజమెత్తారు దీనిపై మేయర్ మహమ్మద్ వసీం సలీం ఘాటుగానే స్పందించారు. అక్రమాలపై విచారణ జరిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రూ.14 లక్షల బిల్లుల చెల్లింపుపై విచారణ చేపట్టాలంటూ కమిషనర్ బాలస్వామిని మేయర్ కోరారు. తామూ ఈ అవినీతిపై నిగ్గు తేల్చాలని కోరుతున్నామని, దీనిని పట్టించుకోకుండా ఎమ్మెల్యే పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదంటూ మేయర్ తెలిపారు. కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ కుక్కల పట్టివేత, ఆపరేషన్లకు సంబంధించి సర్టిఫికెట్‌ను సమర్పించకపోవడం వల్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తాను కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఇందుకు సంబంధించి రూ.14 లక్షల బిల్లులు మంజూరు అయ్యాయంటూ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

పారిశుధ్యంపై కార్పొరేటర్ల అసహనం..

కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో అధికార, విపక్ష కార్పొరేటర్లు పలు సమస్యలపై స్పందించారు. వైసిపి కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్ కుమార్ రెడ్డి, నరసింహులు, రహంతుల్లాలు వీధికుక్కల అంశంపై విచారణ జరిపించి, నిజాలు బహిర్గతం చేయాలని పట్టుబట్టారు. దీనిపై పదేపదే ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి బిల్లుల తయారీ, మంజూరులో అవినీతికి పాల్పడిన వారి వివరాలు బహిర్గతం చేయాలన్నారు. బడ్జెట్ సమావేశం జరగనీయకుండా వీధి కుక్కల అంశాన్ని ప్రతిసారీ ప్రస్తావించడం సరికాదన్నారు. కార్పొరేటర్ మునిశేఖర్ మాట్లాడుతూ తన డివిజన్‌లోని ఇందిరానగర్ ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందన్నారు. కబరస్తాన్ కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని గత సమావేశంలో హామీ ఇచ్చారని, ఇందుకు సంబంధించి చేపట్టిన చర్యలు ఏమిటో సమావేశంలో చెప్పాలని పట్టుబట్టారు. కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు మాట్లాడుతూ 6000 జనాభా కలిగిన తమ డివిజన్‌లో ఆరు నెలలుగా కేవలం ఒక పారిశుధ్య కార్మికుడు మాత్రమే పని చేస్తున్నారని, దీని వల్ల పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయని చెప్పుకొచ్చారు. కార్పొరేటర్ అబూసలేహా మాట్లాడుతూ పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. వీటిపై కమిషనర్ బాలస్వామి స్పందిస్తూ క్లాప్ ఆటోల బిల్లులు కట్టనందున వాహనాలను టాటా కంపెనీ వారు వెనక్కు తీసుకెళ్లారని చెప్పారు. వాటిస్థానంలో తాత్కాలికంగా బాడుగ ట్రాక్టర్లతో పారిశుధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ పనులు చేయిస్తున్నామని తెలిపారు. లోటుపాట్లను సరిజేసుకుని పారిశుధ్య పనులు మెరుగయ్యేలా చర్యలు చేపడతామని సమాధానం ఇచ్చారు.

డంపింగ్ యార్డ్‌పై నిరసన

నగరంలో డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్గంధం, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒకటవ డివిజన్ కార్పొరేటర్ లాలు మేయర్ పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ అంశంపై ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీ నాటికి డంపింగ్ యార్డ్‌ను నగరానికి దూరంగా తరలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగరంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జికి అబుల్ కలాం ఆజాద్ పేరు పెట్టాలని కార్పొరేటర్ లాలూ విన్నవించారు. కార్పొరేటర్ శేఖర్ బాబు మాట్లాడుతూ ఇప్పటికే ఒక బ్రిడ్జికి సైపుల్లా, మరో బ్రిడ్జికి అంబేద్కర్ పేరు పెట్టినందున నూతన బ్రిడ్జికి గతంలో ఉన్న మాదిరిగా నీలం సంజీవరెడ్డి పేరును కొనసాగించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ వాసంతి మాట్లాడుతూ బ్రిడ్జికి శ్రీకష్ణదేవరాయల పేరు పెట్టాలని కోరారు. దీనిపై మేయర్ మహమ్మద్ వసీం సలీం స్పందిస్తూ ఈ అంశంపై ఎవరికి వారు వ్యక్తిగతంగా వినతులు ఇవ్వొచ్చన్నారు.

22 నుంచి 24 వరకు మిల్లెట్ మేళా

జయప్రదం చేయాలని ఎఎఫ్ఎకాలజీ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం

మిల్లెట్ మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న మల్లారెడ్డి తదితరులు

'మన పంటలు, మన వంటలు, ఆరోగ్యం' అన్న మూడు ప్రధానమైన అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 22 నుంచి 24వ తేది వరకు అనంతపురం నగరంలో మిల్లెట్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల కార్యక్రమ వివరాల పోస్టరును విడుదల చేశారు. అనంతరం వైవి.మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. చిరుధాన్యాల సాగులో రైతులతో కలసి పనిచేస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం కలిపి ఈనెల 22 నుంచి నుంచి ఈనెల 24వ తేదీ వరకు అనంతపురం నగరంలోని పోలీసు కన్వెన్షన్ హాలులో మిల్లెట్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో రసాయనిక వాడకం పెరగడంతోపాటు, వాణిజ్య పంటలు సాగు పెరగాక ప్రజల ఆహారపు ఆలవాట్లలోనూ మార్పులొచ్చాయని చెప్పారు. ఈ మార్పులు అనారోగ్యంపై వెలుతున్నాయన్న విషయం అందరినీ కలవర పెడుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే 'మన వ్యవసాయం, మన పంటలు, మన వంటలు, ఆరోగ్యం' వీటన్నింటిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా మిల్లెట్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో చిరుధాన్యాలే కాకుండా వాటితో తయారియన వస్తువులు, వంటలు అందుబాటులో ఉంచుతామన్నారు. వీటిపై సదస్సులూ నిర్వహిస్తామని తెలియజేశారు. 22న మేళా ప్రారంభోత్సవ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బుడిత రాజశేఖర్, అనంత కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. అనంతరం జరిగే ప్రకృతి వ్యవసాయ సదస్సులో ప్రకృతి వ్యవసాయ ఉద్యమకారులు విజయరాం పాల్గొంటారని చెప్పారు. 23న చిరుధాన్యాలతో ఆరోగ్యం అన్న అంశంపై జరిగే సదస్సుకు స్వతంత్ర శాస్త్రవేత్త ఖాదర్‌వలి పాల్గొని ప్రసంగిస్తారన్నారు. 24న వాతావరణ మార్పులు సుస్థిర వ్యవసాయం అన్న అంశంపై జరిగే సదస్సుకు విశ్రాంత వైస్ ఛాన్సలరు బండి వెంకటేశ్వర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదంచ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజ, టింబక్టు ప్రతినిధి రమేష్‌కుమార్, ఎఎఫ్ఎకాలజీ కిష్టప్ప, మురళీకృష్ణ, రమేష్ సుసర్ల పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాల్సిందే..

సిపిఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్ ముందు ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగర సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ తొలగించడంతోపాటు నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డు నుంచి హానికరమైన పొగ, కలుషితమైన గాలి, దుర్వాసన వచ్చి ప్రజల అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా నగర జనాభాకు తగ్గట్టుగా మున్సిపల్ కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే నడిమి వంక, మరువ వంక సైడ్‌వాల్ లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా మురికి నీరు ఇళ్లల్లోకి వస్తోందన్నారు.కావున సైడ్‌వాల్ పూర్తి చేయాలని కోరారు. తిక్క రంగస్వామి గుడి నుంచి తపోవనం వెళ్తే దారిని బాగు చేయాలని, రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందిరానగర్‌లో 1999లో వేసిన సీసీ రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్నారు. 49 డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌కు రోడ్లు, కాలువలు, ఇంటి గుత్తలు వేయాలని కోరారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆందోళనకారుల వద్దకు వచ్చి చర్చించారు. ప్రధానమైన సమస్య డంపింగ్ యార్డులో ఏప్రిల్ 1వ తేదీ నుంచి చెత్త వేయకుండా వేరే ప్రాంతాలకు తరలిస్తామని, అక్టోబర్ 2వతేదీలోపు అక్కడ ఉన్న చెత్తా చెదారాన్ని పూర్తిగా తొలగిస్తామన్నారు. అదేవిధంగా నడిమివంక, మరువ వంక పనులను పూర్తి చేస్తామని, రోడ్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ కాలనీ అధ్యక్షులు కిష్టప్ప, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, వలి, నాయకులు రాజు, ప్రసాద్, వెంకటేష్, రామాంజినమ్మ, లతీఫ్, నాగరాజు, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, కాలనీవాసులు రామాంజనేయులు, శంషాద్, హరిప్రియ, నాగరాజు, శంకర్, రామాంజి, నాగేంద్ర, శివారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ముందు బైఠాయించిన సిపిఎం నాయకులు

'ఉపాధి' కూలీల సమస్యలపై వ్యకాసం స్కూటర్‌యాత్ర

ప్రజాశక్తి-శింగనమల

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. వ్యకాసం ఆధ్వర్యంలో చేపట్టిన స్కూటర్ యాత్రలో భాగంగా సోమవారం మండల పరిధిలోని సలకంచెరువులో ఉపాధి కూలీలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో విరివిగా ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాల న్నారు. అంతేగాకుండా పనులు చేసి 9 వారాలు గుడుస్తున్నా కూలి డబ్బులు రాలేదన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాలే కూలీలకు పనిముట్లు, గడ్డపార, గంపలు, టేపు, పారలు అందజేయాలని కోరారు. వేసవి ప్రారంభం కావడంతో వడదెబ్బ తగలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కూలీల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20, 21వతేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద ఆందోళనలు చేసి వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుంకన్న, రామాంజనేయులు, వన్నమ్మ, లక్ష్మీదేవి, వీరనారప్ప, కోనప్ప, చిట్టెక్క, ఈరక్క, పెద్దకుళ్లాయి, నాగలింగేశ్వర, మునెప్ప, ఆదినారాయణ, కేసన్న, నల్లప్ప, వెంకట్రాముడు, కేసన్న, మల్లేష్, నల్లప్ప, చిన్న వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో 'ఉపాధి' కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం నాయకులు

పుట్లూరు : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన స్కూటర్ యాత్రలో భాగంగా సోమవారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లిలో ఉపాధి కూలీలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, నాయకులు జె.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, కూలీలు పెద్దక్క, ఓలమ్మ, లోకేశ్వరి, సరస్వతి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పదో తరగతి పరీక్ష

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా రాశారు. తొలిరోజు 14 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఇఒ మల్లికార్జున తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పట్టణ సిఐ యువరాజు ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ప్రధానంగా విద్యార్థులు మొబైల్స్, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకుండా పోలీసులు తనిఖీలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయని, ఎవరైనా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

సామగ్రి వితరణ

ఉరవకొండ : పట్టణంలోని కెనరా బ్యాంకు వారు సిఎస్ఆర్ (కెనరా బ్యాంకు సోషియల్ రెస్పాన్సిబిలిటీ) గ్రాంట్ ద్వారా మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పలు సామగ్రిని సోమవారం వితరణ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.2లక్ష విలువజేసే రెండు టెంటో ఫైటర్ (150 లీటర్లు సామర్థ్యం ఉన్న) కూలర్లు, ఫ్లడ్‌లైట్లు, వైరింగ్ తదితర మెటీరియల్‌ను ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకే.రమేష్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జివి కిషోర్, కెనరా బ్యాంకు సిబ్బంది బి.రంగనాథ్, విజయ్, ఆలయ అర్చకులు, సిబ్బంది దీపక్, తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

అనంతపురం రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలని ఈడిగ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే త్వరలో లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘం నాయకులు వేణుగోపాల్, టీచర్ నారాయణస్వామి, లాలప్ప, శ్రీరాములు, ప్రసాద్, రఘునాథ్, నారాయణస్వామి, జగదీష్, కుళ్లాయి స్వామి, వెంకటేష్, ఆదినారాయణ, కృష్ణమూర్తి, ఆదినారాయణ, పరకాల వెంకటేష్ పాల్గొన్నారు.

పీడియాట్రిక్ సర్జరీ వార్డు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సర్జరీ వార్డును మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా|| కెఎస్ఎస్. వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడియాట్రిక్ సర్జరీ వార్డును ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. మెడికల్ కళాశాలలో త్వరలో పీడియాట్రిక్ సీట్లు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడియాట్రిక్ సర్జరీ వార్డును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

రంజాన్ తోఫా ఇవ్వాలని ఆవాజ్ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు రంజాన్ తోఫా ఇవ్వాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ హరి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ తోఫా ఇచిందని, వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో ఇవ్వలేదన్నారు. ఆ తరువాత టిడిపి కూటమి వచ్చిందని తోఫా అమలు చేస్తుందని ప్రజలు ఆశించారన్నారు. కానీ ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం సంక్రాంతి, క్రిస్మస్ రంజాన్ కానుకలు మరచినట్లు ఉందన్నారు. రంజాన్ తోఫా ఇంత వరకు ఊసే లేదన్నారు. తక్షణమే మైనార్టీలకు రంజాన్ తోఫా, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన తహశీల్దార్ ప్రభుత్వ స్థాయిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం ఎజెన్సీకి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు లతీఫ్, దాదు, బాబావలి, రెహమాన్, హుస్సేన్, మహమ్మద్ బాషా, మస్తాన్‌వలి, రఫీ, హిమాం సార్ నూర్ బాషా, రియాజ్, బీరప్ప, వలి, రవిచంద్రబాబు, దాదా ఖలందర్, ఇస్మాయిల్

తహశీల్దార్ హరికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆవాజ్ నేతలు

పొజిషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోండి

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ షర్మిల

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల వ్యాప్తంగా ఇంటి స్థలాలు ఉన్న లబ్ధిదారులు పొజిషన్ ధ్రువీకరణ పత్రం మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ సి.షర్మిల సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 983 మంది ఇంటి స్థలాలు ఉన్న లబ్ధిదారులు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఇంటి పొజిషన్ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెలాఖరిలోగా మీ పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, హౌసింగ్ ఎఇ గోపీచంద్‌నాయక్, వీఆర్వోలు రమేష్, ఎర్రిస్వామి, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, వెన్నెల రాజశేఖర్, ఎర్రిస్వామి, మధుసూదన్, నగేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప మున్సిపల్ ఇంజినీర్ రవిప్రకాష్ నాయుడుకు సూచించారు. ఆమె సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో డిఇతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు స్టాండ్ బై మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలన్నారు. వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని కౌన్సిలర్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప

ఈద్గా మైదానం వద్ద శానిటేషన్ పనులు

గుత్తి : పట్టణంలోని ఈద్గా మైదానం వద్ద మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం శానిటేషన్ పనులను చేపట్టారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు పవిత్ర ప్రార్థనలు చేసుకోవడానికి ఈద్గా మైదానం వద్ద జెసిబి ద్వారా కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించారు. ఆయా పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, మాజీ సర్పంచి డి.హుస్సేన్ పీరా శానిటేషన్ పర్యవేక్షించారు.

24న వంటావార్పు

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ స్థలం సాధనకు ఈనెల 24న సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో వంటా వార్పు కార్యక్రమం చేపట్టనున్నట్లు హాస్టల్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 24న సోమవారం జరిగే ధర్నా కార్యక్రమానికి నియోజకవర్గంలోని దళితులు భారీగా తరలివచ్చి వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ కమిటీ సభ్యులు, మాజీ సిడిపిఒ రామాంజినమ్మ, గోపాల్, ఎర్రిస్వామి, వనూరుస్వామి, శ్రీరాములు, ఆనంద్, రామకృష్ణ, మధుప్రసాద్, ఎర్రిస్వామి, సురేంద్ర, వీరన్న, రాజశేఖర్, పురుషోత్తం, పోలమ్మ, విజయ్, రామాంజనేయులు, గౌరమ్మ, చిన్నహోతూరు రాము, పీసీ ప్యాపిలి ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హాస్టల్ కమిటీ సభ్యులు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమ్మెకు సిద్ధం

సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిచో సమ్మె చేపట్టడం ఖాయమని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికా ర్జున హెచ్చరించారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెల్లవారుజామున కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం శూన్యమన్నారు. కార్మికులు మరణించి రెండేళ్లయినా వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించడంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్ కాలయాపన చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పెరుగుతోన్న పట్టణ విస్తరణ, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచకుండా కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించడం దుర్మార్గమన్నారు. పనిముట్లు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు సమానంగా వేతనం చెల్లించాలని, టిఎ, డిఎ, క్యాజు వల్ సెలవులను ఇంజినీరింగ్ కార్మికులకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిచో సమ్మెబాట పట్టాల్సి వస్తుందని, తద్వారా ప్రజలు ఎదుర్కొనే పారిశుధ్య సమస్యలకు మున్సిపల్ అధికార యంత్రాంగమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాయదుర్గం శాఖ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి మల్లేష్, కోశాధికారి రాము, కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం రూరల్ : రూడ్‌సెట్ సంస్థలో ఏప్రిల్ 3 నుంచి నెలరోజులపాటు నిరుద్యోగ మహిళలకు జరదోసి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మహిళలు ఆధార్, రేషన్ కార్డు కలిగిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 45ఏళ్లలోపు ఉన్న మహిళలు అర్హులు అన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్.. 94925 83484 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పశు వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఉరవకొండ : పశువైద్య విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలను మానుకుని వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పశు వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని నెల రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో వారితో కలిసి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంప్

పుట్లూరు : ఈనెల 19 నుంచి 22, 25 నుంచి 28వతేదీ వరకూ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19, 20న పుట్లూరు, కడవకల్లు 21, 22న పుట్లూరు, చెర్లోపల్లి 25న కోమటికుంట్ల, అరగటివేముల, 26న అరకటివేముల, బాలాపురం వెల్లుట్ల, 27, 28న ఎస్.గూడూరు, కందికాపుల సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బంగారు నగలు చోరీ

గుత్తి : గుర్తు తెలియని దుండగులు గుత్తి ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను అపహరించారు. గుత్తికి చెందిన శ్రావణి తన భర్త మధుమోహన్‌తో కలిసి యాడికిలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. ఆదివారం రాత్రి తిరిగి స్వగ్రామానికి బస్సులో వస్తుండగా బ్యాగులో ఉంచుకున్న 10 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఇంటికి వెళ్లిన ఆమె బ్యాగును పరిశీలించగా బంగారు నగలు లేకపోవడంతో సోమవారం పోలీసులు ఫిర్యాదు చేసింది. పోలీసులు బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

గుత్తి : పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని తహసిల్దార్ డి.ఓబిలేసుకు సోమవారం హరిత దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, ఆరోగ్య సిబ్బంది, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా వీల్ చైర్లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష గదుల్లో వెలుతురు, గాలి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

విధుల్లో చేరిన తహశీల్దార్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం తహశీల్దార్ భాస్కర్ సోమవారం తిరిగి విధుల్లో చేరారు. అనారోగ్యం కారణంగా ఆయన మెడికల్ లీవ్‌లో వెళ్లిన విషయం తెలిసిందే. మెడికల్ లీవ్ ముగియడంతో ఆయన తిరిగి విధుల్లో చేరారు. ఇప్పటివరకూ కంబదూరు తహశీల్దార్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

తహశీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహశీల్దార్ మునివేలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వివిధ పనులపై కార్యాలయం వచ్చే ప్రజల దాహర్తి తీర్చేందుకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కాగా ఎలాంటి షెడ్డు లేకుండా ఆరుబయట కేవలం రెండు కుండలు, గ్లాసులు పెట్టి అందులో నీరు పోసి తూతూమంత్రంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం ఏంటని ప్రజలు పెదవివిరుస్తున్నారు.

చలివేంద్రంలో నీరు అందిస్తున్న తహశీల్దార్ మునివేలు

పచ్చనిచెట్లు నరికివేత దుర్మార్గం..

ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

పచ్చని చెట్లు నరకడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలం లోని గరుగుచింతలపల్లి గ్రామంలో టిడిపి కార్యకర్త మంజుల నాగరాజుకు చెందిన 180 చీనీచెట్లను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికిన విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ పుట్లూరు, యల్లనూరు మండలాల్లో కొందరు ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడం సిగ్గు చేటన్నారు. గతం లో ఆయా మండలాల్లో చెట్లు నరికే సంస్కృతి ఉండేదన్నారు. మళ్లీ ఆ సంస్కృతి రావడం బాధాకరమన్నారు. ఈ సంస్కృతిని ప్రోత్సహించేది ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. టిడిపి కార్యకర్తను ఆర్థికంగా దెబ్బతీసేందుకే చీనీచెట్లను నరికారన్నారు. ఇదే మండలంలో కొండగారికుంటలో టిడిపికి చెందిన వారే అరటి చెట్లను నరకడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశామని, వారు శిక్ష కూడా అనుభవిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి దోషులను శిక్షించాలని పోలీసులకు తెలిపినట్లు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-బొమ్మనహాల్

దళితుల పట్ల తహశీల్దార్ వైఖరిని ఖండిస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంబేద్కర్ యువసేన నాయకులు సాకే రమేష్, సింగేపల్లి పవన్, సుమారు 50 మంది దళితులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తహశీల్దార్ నిరంకుశధోరణి వల్ల మండలంలోని చంద్రగిరి గ్రామంలో ఓ రైతు హత్యకు గురయ్యారని మండిపడ్డారు. దళితుల భూ సమస్యల పరిష్కారంపై, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించడంలో కాలయాపన చేస్తున్నారని వాపోయారు. జిం దాల్, నేమకల్లులోని ఫ్యాక్టరీల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు గంట తర్వాత తహశీల్దార్ బయటకు వచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ధర్నాలో వన్నూరుస్వామి, నాగార్జున, ఉమేష్, హనుమంతు, సురేంద్ర, భరత్‌కుమార్, హరి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన అంబేద్కర్ యువసేన నాయకులు

జెడ్.వీరారెడ్డి కాలనీ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీరారెడ్డి కాలనీ సమీపంలో అధికారులు బస్టాప్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల కోరారు. ఈమేరకు ఎపిఎస్ ఆర్టీసీ గుత్తి డిపో అధికారి శ్రీపాదకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్.వీరారెడ్డి కాలనీలో 200 కుటుంబాలు, దాదాపు 1000 మంది ప్రజల నివసిస్తున్నారన్నారు. కాలనీ పట్టణ శివారులో ఉండటం వల్ల కాలనీవాసులు పట్టణంలోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, మహిళలు 44వ జాతీయ రహదారి వద్ద నిలబడడానికి అవస్థలు పడుతున్నారని చెప్పారు. కావున బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, మహిళా సంఘం నాయకురాలు ఆర్ఎన్.కవిత, డివైఎఫ్ఐ నాయకుడు అశోక్, శృతి, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అధికారి శ్రీపాదకు వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

మండలానికి 50 ట్రాక్టర్లు మంజూరు చేయాలి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం

రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రతి మండలానికి 50 రైతు రథాలు(ట్రాక్టర్స్) మంజూరు చేయాలని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి పాలనలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అధిక ప్రాధ్యా న్యత ఇచ్చామన్నారు. రైతుల సౌకర్యార్థం 113 పథకాలు అమలు చేశామన్నారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసిపి ఆయా పథకాలను పక్కనపెట్టి రైతాంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు. మైక్రో ఇరిగేషన్ కింద డ్రిప్, స్ప్రింక్లర్లపై కేంద్రం సబ్సిడీ రూపంలో ఇచ్చిన నిధులను కూడా ఖర్చు చేయలేద న్నారు. తద్వారా తక్కువ వర్షపాతం నమోదయ్యే రాయలసీమ ప్రాంత రైతులు ఎక్కువ నష్టపోయా రన్నారు. అనంతపురం జిల్లా ప్రజల ఇబ్బందులు గుర్తించిన సిఎం చంద్రబాబు నిబంధనలు సడలిస్తూ పదెకరాలున్న వారికీ సామాజిక పింఛను మంజూరు చేయించడం సంతోషకరమన్నారు. సీమలో అనావృష్టి పరిస్థితులను గుర్తించి పదెకరాల మెట్ట కంటే ఎక్కువ వున్న రైతులకు కూడా నిబంధనలు సడలించి 90 శాతం డ్రిప్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

సిపిఎం సీనియర్ నాయకులు జ్ఞానమూర్తికి పరామర్శ

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని మోపిడి గ్రామం లో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బి.జ్ఞాన మూర్తిని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ సోమవారం పరామర్శించారు. ఇందులో భాగంగా అనారోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బెంగళూరులో చికిత్స చేయించుకు న్నట్లు జ్ఞానమూర్తి తెలిపారు. జ్ఞానమూర్తితో పాటు కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు మురళి, వీరాంజనేయులు, రామాంజనేయులు నాయక్, రవికుమార్, సీనప్ప, తదితరులు పాల్గొన్నారు.

పునీత్ రాజ్‌కుమార్‌కు నివాళి

ప్రజాశక్తి-రాయదుర్గం

కన్నడ సినీ నటుడు పునీత్‌రాజ్‌కుమార్ జయంతి వేడుకలను సోమవారం పట్టణంలో ఈడిగ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్న క్యాంటీన్ వద్ద 300 మందికి అన్నదానం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పునీత్ రాజ్‌కు మార్ లాంటి గొప్ప వ్యక్తి ఈ లోకంలో లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించామ న్నారు. భవిష్యత్తులో పునీత్ రాజ్ కుమార్ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం అధ్యక్షుడు కెబి.అశోక్, మర్రిస్వామి, గంగాధర్, మారుతి, అంజి, సిద్ధప్ప, నీలకంఠ, రమేష్, పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న పునీత్ అభిమానులు